

చేనేతకు అందని సహకారం

- ఏడేళ్లకు పైగా ఎన్నికలు లేవు..
- 14 సార్లు పాత పాలక వర్గం పొడిగింపు
- సొంత చీరలు బెస్కోకు అమ్ముకుంటున్న మాస్టర్ వీవర్స్



6

మంత్రి అండ చూసుకునే ఆగడాలు

- మోసం చేసిన వ్యాపారిపై చర్యలు తీసుకోవాలి
- పోలీసులు కేసు ఎందుకు నమోదు చేయలేదు?
- బాధితుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి



6

న్యాక్ బృందానికి ఘన స్వాగతం

- మొదటి రోజు పీయూలోని పలు విభాగాల పరిశీలన


పాలమూరు యూనివర్సిటీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీని గురువారం ఆరుగురు సభ్యులతో కూడిన న్యాక్ బృందం సందర్శించింది. వారికి వీసీ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ చెన్నప్ప, అధికారులతో కలిసి స్వాగతం పలికారు. అనంతరం యూనివర్సిటీ పరిపాలన విధివిధానాలు వివరించారు. న్యాక్ ఛైర్మన్ రామశంకర్‌దూబే, సభ్యుడు కేకే అగర్వాల్, డాక్టర్ అన్నస్వామి నారాయణమూర్తి, డాక్టర్ జయశ్రీ నాయర్, డాక్టర్ అశితోష్ కుమార్, డాక్టర్ మలేఖ్యాదాస్‌లతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం మూడు గ్రూపులుగా ఏర్పడి ఆర్ట్స్, సైన్స్ కళాశాల, అకాడమిక్ బిల్డింగ్ పరిశీలించారు. పీయూ అధ్యాపకులకు పరిశోధన పత్రాల గురించి పలు ప్రశ్నలు అడిగారు. యూనివర్సిటీలో గదులు, విద్యార్థుల మౌలిక వసతులు పరిశీలించారు. చివరి సెషన్‌లో లైబ్రరీ ఆడిటోరియంలో పీయూ ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు.

నేటి పర్యటన వివరాలు..

పీయూకి వచ్చిన న్యాక్ మూడు బృందాలు పర్యటనలో భాగంగా రెండవ రోజు శుక్రవారం మొదటి సెషన్‌లో పీయూకి అనుబంధంగా ఉన్న వనపర్తి, కొల్లాపూర్, గద్వాల పీజీ కేంద్రాలను పరిశీలిస్తారు. మధ్యాహ్నం సెషన్‌లో తిరిగి పీయూకి చేరుకుని ప్లేస్‌మెంట్ సెల్, విద్యార్థులు, యూనివర్సిటీ ఉద్యోగులతో సమావేశం పలు అంశాలపై చర్చలు చేయనున్నారు.

భూ భారతి.. రైతు హారతి





ఆంధ్రజ్యోతి సర్వే

- ధరణి రద్దు.. భూ భారతి బిల్లు ఆమోదంపై ప్రజాభిప్రాయం
- వీఆర్‌వో వ్యవస్థ కూడా అవసరమంటున్న భూ యజమానులు
- కాస్తుకాలం, సాదాబైనామాపై మిశ్రమ స్పందన
- స్థానిక వ్యవస్థతో భూ వివాదాల పరిష్కారం సులభం
- భూ భారతి ఆమోదం, ధరణి రద్దుపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక సర్వే

ధరణి అమలులో రైతులు ఎదుర్కొన్న సమస్యలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన భూ భారతి చట్టానికి ప్రజలు ఆమోదం తెలుపుతున్నారు. రద్దు అయిన వీఆర్‌వో వ్యవస్థను కూడా మళ్లీ అమలు చేయడం సముచితం అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ చట్టంపై 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా చేపట్టిన సర్వేలో రైతులు అత్యధికంగా సానుకూలంగా స్పందించారు. ధరణిలో ఉన్న లోపాలు, కొత్త చట్టంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముందే విస్తృతంగా రైతులతో అభిప్రాయ సేకరణ చేయడం ఇందుకు ఉపయోగపడింది. ఈ చట్టంతోనైనా భూవివాదాలు తగ్గి ప్రయోజనం జరుగుతుందని రైతులు ఆశిస్తున్నారు.

మహబూబ్‌నగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని చేపట్టడంతో పాటు అప్పటికే ఉన్న రిజిస్ట్రేషన్ విధానాలను మార్చి ధరణిని తీసుకువచ్చిన విషయం తెలిసిందే. సబ్ రిజిస్ట్రార్ స్థానంలో తహసీల్దార్‌కే జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ హోదా కల్పించి వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు తహసీల్దార్ కార్యాలయాల్లోనే చేపట్టింది. గతంలో ఆర్డీవో, జేసీ, కలెక్టర్ వద్ద అర్జీల పరిష్కారానికి అవకాశం ఉండగా ఆ కోర్టులను కూడా ఎత్తివేసింది. మరీ ముఖ్యంగా వీఆర్‌వో, వీఆర్‌ఏ వ్యవస్థలను పూర్తిగా రద్దు చేసి వారిని వేరే శాఖల్లో సర్దుబాటు చేసింది. ఆర్డీవో, జేసీ కోర్టుల్లో ఉన్న కేసులను ప్రత్యేక కార్యక్రమంతో డిస్పోజ్ చేసింది. అక్కడ రిజెక్ట్ అయిన వివాదాల పరిష్కారానికి కోర్టును ఆశ్రయించాల్సిందిగా అప్పట్లో అధికారులు సూచించారు. అయితే ధరణి వచ్చినప్పటి నుంచి దానిచుట్టూ అనేక వివాదాలు చుట్టుముట్టాయి. బీఆర్‌ఎస్ ఎన్నికల ఓటమికి ధరణి కూడా ఒక కారణమనే భావన కూడా ఆ పార్టీ కార్యకర్తల్లో ప్రధానంగా ఉన్నది. ధరణి వచ్చిన తర్వాత రిజిస్ట్రేషన్లు కావడంలో వేగం పెరిగినప్పటికీ క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోకుండా వెబ్‌సైట్‌ను రూపొందించడం, ఎల్‌ఆర్‌యూపీ సమయంలో భూముల్లో హెచ్చుతగ్గులు వేయడం, ధరణి కోసం తీసుకున్న ఆపరేటర్లు చేసిన తప్పులు వెరసి పాత వివాదాల కంటే ధరణి వచ్చిన తర్వాత వివాదాల శాతం మరింత ఎక్కువైంది. స్థానికంగా పరిష్కారం చేసుకోవడానికి వీలు లేకుండా తహసీల్దార్ నుంచి కలెక్టర్ వరకు చేతుల్లో ఏమీ లేకపోవడం తప్పు జరిగినా, కావాలని తప్పు చేసినా కోర్టుకు వెళ్లాలని సూచించడం తప్పా ఏమీ చేయలేని స్థితి వచ్చింది. దీంతో ధరణిపై విపరీతంగా అసహనం పెరిగింది. కాస్తు కాలం తొలగించడం, సాదాబైనామాలకు దరఖాస్తులు స్వీకరించినా రిజిస్ట్రేషన్లు చేపట్టకపోవడం, ఎప్పటికప్పుడు ధరణిలో మాడ్యూల్స్‌ను మార్చడం వంటి సమస్యలు చాలా ఉత్పన్నమైనై. ఫిర్యాదులు కూడా ఎక్కువయ్యాయి. ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ పెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో భాగంగా ధరణి రద్దు చేస్తామని, అందులో ఉన్న లోపాలను రద్దు చేసి కొత్త వ్యవస్థను తీసుకువస్తామని హామీ ఇచ్చింది. ఇటీవల భూ భారతి పేరుతో బిల్లు

(మిగతా 6లో..)

మహిళల అభ్యున్నతికి కృషి

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- రూ.5కోట్లతో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన



జిల్లా మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ బీఎం సంతోష్, గడ్డం కృష్ణారెడ్డి, బండారి భాస్కర్, అధికారులు

గద్వాల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని దౌదర్‌పల్లి దర్గా వద్ద రూ.5కోట్లతో మహిళా సమాఖ్య భవనం, జీవనోపాధుల శిక్షణ కేంద్రం నిర్మాణానికి కలెక్టర్ బీఎం సంతోష్‌తో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో అనేక కార్యక్రమాలను చేపట్టిందని వివరించారు. మహిళా సంఘాలు సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఇచ్చిందని తెలిపారు. పౌల్ట్రీ, ఫిష్ యూనిట్లతో పాటు క్యాంటీన్‌లను ఏర్పాటు చేసుకోవడానికి చేయూతనందిస్తోందని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రూ.5కోట్లతో నిర్మిస్తున్న భవనంలో అన్ని హంగులతో కార్పొరేట్ స్థాయిలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇక్కడే మహిళా సంఘాల సభ్యులకు అనేక అంశాలలో శిక్షణ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ హనుమంతు, పంచాయతీ రాజ్ ఈఈ దామోదర్‌రావు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సంగీత తదితరులు పాల్గొన్నారు.

పది జీపీఏ సాధిస్తే మొబైల్ ఫోన్

- విద్యార్థులకు నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ ఆఫర్



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ బదావత్ సంతోష్

కొల్లాపూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో పది జీపీఏ సాధించిన విద్యార్థులకు మొబైల్ ఫోన్ బహుమతిగా అందజేస్తానని కలెక్టర్ బదావత్ సంతోష్ హామీ ఇచ్చారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థుల కోసం ప్రతి రోజు రుచికరమైన, పోషకమైన భోజనం అందించాల్సిందిగా వంట సిబ్బందిని ప్రోత్సహించడం ఎంతో ముఖ్యం అన్నారు. విద్యార్థులకు కష్టపడి చదువుకోవడం ద్వారా తమ కుటుంబానికి, పాఠశాలకు, కొల్లాపూర్ ప్రాంతానికి మంచి పేరు తెచ్చేలా కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా హెచ్‌ఎంలతో పాఠశాలలో ప్రస్తుతం ఉన్న వసతులు, విద్యార్థులకు అందుబాటులో ఉన్న వనరులు, గతేడాది పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో బన్సీలాల్, తహసీల్దార్ విష్ణువర్ధన్‌రావు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

రహదారిపై ప్రగతిరథ సారథి

- ఉమ్మడి జిల్లాలో పది ఆర్టీసీ డిపోలు, 940 మంది డ్రైవర్లు
- నేడు ఆర్టీసీ డ్రైవర్ల దినోత్సవం

7

నేడు విద్యాహక్కు చట్టం పై 'ఆంధ్రజ్యోతి' చర్చా వేదిక

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): 'విద్యాహక్కు చట్టం అమలు' అంశంపై 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో శుక్రవారం చర్చావేదిక నిర్వహించనున్నారు. పాలమూరు పట్టణంలోని ఆర్‌వీఎం సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు విద్యాహక్కు చట్టం అమలు, అంశాలపై డీఈవో ప్రవీణ్ కుమార్, అధికారులు బాలు యాదవ్, శ్రీనివాస్ సమక్షంలో చర్చ జరుపనున్నారు.

ప్రజా కోర్టులుగా గ్రామసభలు

- సల్కెలాపూర్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం
- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

ఖిల్లాఘణపురం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారుల ఎంపిక గ్రామసభల బాధ్యత అని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని సల్కెలాపూర్‌లో గురువారం ప్రజాపాలన గ్రామసభలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డిలను గ్రామస్థులు ఎద్దుల బండిపై ఊరేగిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం నాలుగు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల జాబితా తప్పుగా రూపొందించినా, నిర్లక్ష్యం వహించినా అధికారులే బాధ్యత వహించాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి వనపర్తి జిల్లాకే రూ.175 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందకపోతే 8333923733 ఫోన్ నెంబర్‌కు మెసేజ్ చేయాలని సూచించారు. ఎంపీ మాట్లాడుతూ.. ప్రజాపాలన గ్రామసభలు ప్రజా కోర్టులుగా నిర్వహిస్తున్నారని తెలిపారు. పారదర్శకంగా పథకాలు అందించడానికి లబ్ధిదారుల జాబితా చదివి వినిపిస్తున్నారని తెలిపారు. పథకాలలో తప్పుడు సమాచారం ఉంటే ప్రజలు గుర్తించి అధికారుల దృష్టికి తేవాలన్నారు. ఎన్నడూ లేని విధంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎలక్ట్రిసిటీ ప్రాజెక్టు పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నామని, 10వేల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. సల్కెలాపూర్‌లో బ్యాంకు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అసంపూర్తిగా ఉన్న రోడ్లను పూర్తి చేస్తామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం వనపర్తి నియోజకవర్గానికి పెద్ద పాలేరుగా పని చేస్తానని అన్నారు. రాబోయే ఎన్నికల్లో గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సల్కెలాపూర్‌లో పీహెచ్‌సీ, మహిళా భవనం, బ్యాంకు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, మామిడిమాడ రిజర్వాయర్ వద్ద రూ.కోటితో హరిత హోటల్ లాంటి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని మంత్రి, ఎంపీని కోరారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ.. సాగు భూములకు మాత్రమే రైతు భరోసా వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. పథకాలకు లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, మండల ప్రత్యేక అధికారి సుధీర్‌రెడ్డి, తహసీల్దార్ సుగుణ, ఎంపీడీవో వెంకటాచారి, శంకర్ ప్రసాద్, విజయ్ కుమార్, సాయిచరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సల్కెలాపూర్‌లో ఎద్దుల బండిపై గ్రామసభకు వస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే మేఘారెడ్డి

ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన నీరు

- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ
- ప్రధానమంత్రి అమృత్ యోజన ప్రారంభం



మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

ఆత్మకూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలో ప్రధానమంత్రి అమృత్ యోజన పథకం 2.0 ద్వారా 12 లక్షల లీటర్ల స్వచ్ఛమైన నీటిని అందించే పథకానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ పట్టణాలు, పల్లెలు సురక్షితంగా ఉంటేనే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని గ్రహించి ప్రతి పట్టణంలో శుద్ధజలం అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ పథకం ద్వారా పట్టణంలోని పది వార్డులలో పది వాటర్ ట్యాంకులను నిర్మించి నిరంతరం శుద్ధ జలం అందివ్వనున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే ప్రతి పథకంలో కేంద్ర ప్రభుత్వం వాటా ఉందని గుర్తు చేశారు.

మభ్య పెట్టేందుకే గ్రామసభలు

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ప్రజాపాలన ద్వారా దరఖాస్తులు కోరినప్పటికీ.. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పడం ప్రజలను మభ్య పెట్టడం తప్పా మరొకటి కాదని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్న కారణంగా గ్రామసభలు పెట్టి మోసం చేయడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తామంటూ మంచాలను ప్రారంభించే వారిని ఎక్కడా చూడలేదని విమర్శించారు.

అనర్హులను ఎంపిక చేస్తే ఉద్యోగాలు ఊడుతాయ్..

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

వెల్దండ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అమలులో లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని చౌదర్‌పల్లిలో ప్రజాపాలన గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు.. నిజమైన లబ్ధిదారులను గుర్తించాలని, చివరకు తాను చెప్పినా సరే అర్హతే ప్రామాణికంగా తీసుకోవాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారుల ఎంపిక సక్రమంగా లేకపోతే ఉద్యోగాలు ఊడుతాయని హెచ్చరించారు. గత ప్రభుత్వం ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని, కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం పనిచేస్తుందని ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. పేదలకు పథకాలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. భూమిలేని నిరుపేద కూలీలకు ఏడాదికి రూ.12వేలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పాలబిల్లులు రావడంలేదని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా గొల్లోనిపల్లిలో కొత్తగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రత్యేకాధికారి నిజాంఅలీ, తహసీల్దార్ కార్తీక్‌కుమార్, ఏపీవో ఈశ్వర్, డీటీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

భర్త తలపై రోకలిబండతో మోదిన భార్య

- చికిత్స పొందుతూ మృతి

కల్వకుర్తి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): భర్తను భార్య రోకలిబండతో కొట్టడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సుభాష్‌నగర్ చెందిన కె.లక్ష్మణ్ (42), భార్య మస్తానమ్మ, ఇద్దరు కుమారులతో కలిసి నివాసం ఉంటున్నాడు. బుధవారం రాత్రి కుటుంబ విషయంలో గొడవపడి భార్య తన భర్తను క్షణికావేశంలో రోకలిబండతో తలపై మోదింది. తీవ్రంగా గాయపడిన లక్ష్మణ్‌ను స్థానిక ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం లక్ష్మణ్ మృతి చెందాడు. తమ్ముడు రామస్వామి ఫిర్యాదు మేరకు సీఐ నాగార్జున ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మంత్రి అండ చూసుకునే ఆగడాలు

» రియల్ ఎస్టేట్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలి

» కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి



నరసింహను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు చేసిన ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయకుండా రూ.లక్షలు దోచుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారి వద్ద ప్లాట్ కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ కాకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడి జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రేకులపాడు నరసింహను గురువారం పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, మెరుగైన చికిత్స అందించాలని కోరారు. బాధితుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి.. ఘటనకు గల కారణాలను తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి బయట విలేకరులతో మాట్లాడారు. కూలీ పని చేసుకుని సంపాదించుకున్న డబ్బులతో ప్లాటు కొనుగోలు చేస్తే రిజిస్ట్రేషన్ చేయకుండా రియల్టర్ మోసం చేశాడన్నారు. మనస్తాపంతో బాధితుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. బాధిత కుటుంబసభ్యులు పెద్దకొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటికీ కేసు నమోదు చేయలేదన్నారు. ఎవరి అండ చూసుకుని పోలీసులు పట్టించుకోవడం లేదని, పేద ప్రజలకు అన్యాయం జరిగితే పోలీసు స్పందించరా అని ప్రశ్నించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో మంత్రి అనుచరులు అధికారాన్ని అడ్డంగా పెట్టుకుని పేదలను, బీఆర్ఎస్ కార్యకర్తలపై వేధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పెద్దకొత్తపల్లి ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు. కలెక్టర్ వెంటనే స్పందించి కారకులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట రంగినేని అభిలాష్‌రావు, రఘువర్ధన్‌రెడ్డి, కిషన్‌నాయక్, రాజుగౌడ్ తదితరులు ఉన్నారు.

అందరికీ వైద్య సేవలందాలి

» కేంద్ర బృందం ప్రధాన అధికారి ఎస్.కవిత



ఆసుపత్రిలో కేంద్ర బృందాన్ని సన్మానిస్తున్న గగ్గలపల్లి వైద్య సిబ్బంది

కందనూలు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజలందికీ వైద్య సేవలు అందించాలని కేంద్ర బృందం ప్రధానాధికారి డాక్టర్ ఎస్.కవిత వైద్య సిబ్బందికి సూచించారు. కేంద్రం బృందం నాగర్‌కర్నూల్ జిల్లా పర్యటన సందర్భంగా నాగర్‌కర్నూల్ మండలంలోని గగ్గలపల్లిలో ఆరోగ్య ఉప కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన రోగులను పరీక్షించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరుతున్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకాలు అందరికీ అందేలా ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రతి పేద వారికి ప్రభుత్వ వైద్యం అందితేనే సమాజం అభివృద్ధి చెందినట్లని ఆమె పేర్కొన్నారు. సభ్యులు శక్తి మాళవిక, యాన్సీ ప్రీతి, రేణయ్య, జ్యోతి, వనజ పాల్గొన్నారు.

చేనేతకు అందని సహకారం

» ఏడేళ్లకు పైగా ఎన్నికలు లేవు..

» 14 సార్లు పాత పాలకవర్గం పొడిగింపు

» సొంత చీరలను టెస్కోకు అమ్ముకొని మాస్టర్ వీవర్స్ లబ్ధి

» ఎన్నికల కోసం ఎదురుచూపులు



రాజోలి చేనేత సహకార సొసైటీ కార్యాలయం

అయిజ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో అస్తిత్వాన్ని కోల్పోతున్నాయి. సంఘాలకు ఫిబ్రవరి 12, 2013లో చివరి ఎన్నికలు నిర్వహించారు. 2018లో ఐదేళ్ల కాల పరిమితి మించిపోయింది. అది మొదలు ఇప్పటి వరకు ఏడేళ్లకు పైగా ఎన్నికలు నిర్వహించలేదు. ప్రభుత్వాలు మారుతున్నా పట్టించుకునే వారు లేరనే విమర్శలు కార్మికుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలినా.. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమైనా శ్రద్ధ చూపాలని కార్మికులు కోరుతున్నారు.

సొంత చీరలను అమ్ముకుంటున్న మాస్టర్ వీవర్స్

జోగుళాంబ గద్వాల జిల్లాలో 28 సహకార సంఘాలు ఉన్నాయి. జిల్లాలోని అయిజ, రాజోలి, గట్టు, అలంపూర్ సంఘాలు టెస్కో (తెలంగాణ ప్రభుత్వ కోఆపరేటివ్ సొసైటీ)తో లావాదేవీలు చేస్తున్నాయి. సంఘాల కార్యవర్గ సభ్యుల్లో మాస్టర్ వీవర్స్ చాలా మంది ఉన్నారు. మరికొంత మంది తమ వారితో కలిసి సొంత సహకార సంఘాలను ఏర్పాటు చేసుకుని లబ్ధి పొందుతున్నారు. టెస్కో సహకార సంఘాల చేనేత చీరల పేరిట సొంత చీరలను అమ్ముకుని లబ్ధి పొందుతున్నారు. ప్రతీ సంఘంలో కొత్త వారిని చేర్చుకోవాలన్నా, చనిపోయిన సభ్యుల స్థానంలో వారి కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేయాలన్నా కార్యవర్గ సభ్యులు సమావేశమై తీర్మానించాల్సి ఉంది. జిల్లాలోని కొన్ని సంఘాలలో అలా చేయని కారణంగా జిల్లా అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. అవకతవకలను అరికట్టాలని ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే అపవాదు ఉంది.

14వ సారి గడువు పూర్తి

ఫిబ్రవరి 12వ తేదీతో పాత పాలక వర్గానికి ఇచ్చిన 14వ గడువు కాస్త పూర్తి కానుంది. 2013లో ఫిబ్రవరి 12వ తేదీన చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. 2018లో ఐదేళ్ల గడువు కాస్త పూర్తయ్యింది. అది మొదలు ఇప్పటి వరకు సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. ఆరు నెలలకు ఒక సారి చొప్పున పాత పాలక వర్గం గడువు పొడగించారు. ఏడేళ్ల కాలానికి 14 సార్లు పాలకవర్గం యొక్క గడువును పొడగిస్తూ వచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికలను ఎప్పటికప్పుడు వాయిదా వేసింది. పాత పాలకవర్గాలనే పర్సన్ ఇన్‌చార్జిలుగా కొనసాగిస్తూ వచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం చొరవ తీసుకుని చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి కొత్త పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని చేనేత కార్మికులు కోరుతున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలతో పాటే..



చేనేత సహకార సంఘాలకు గడువు పొడగిస్తూ వచ్చాము. ఈ సారి స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు ఈ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. రాష్ట్ర సహకార ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఎన్నికలు జరుగుతాయి. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలు అమలు చేస్తాము. ఫిర్యాదులు అందితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ఎలాంటి సమస్య అయినా తమ దృష్టికి వస్తే పరిష్కారానికి కృషి చేస్తాం.

– గోవిందయ్య, చేనేత జౌళిశాఖ జిల్లా అధికారి

ముదిరాజుల చైతన్యంతోనే బీసీ-ఏ సాధించగలుగుతాం

» ఉస్మానియా పీహెచ్‌డీ స్కాలర్ శివ ముదిరాజ్



అచ్చంపేటలోని అంబేద్కర్ చౌరస్తాలో మాట్లాడుతున్న శివ ముదిరాజ్

అచ్చంపేట టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ముదిరాజుల చైతన్యంతోనే బీసీ-ఏను సాధించగలుగుతామని ఉస్మానియా పీహెచ్‌డీ స్కాలర్ శివ ముదిరాజ్ అన్నారు. ముదిరాజుల హక్కుల సాధన కోసం రాజకీయ పార్టీలకతీతంగా చేస్తున్న బస్సుయాత్ర గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చేరుకుంది. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ముదిరాజ్ సంఘం నాయకులు వెంకటయ్య, రేణయ్య, నిరంజ్ ముదిరాజ్ బాలరాజు వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని, జనాబా దామాషా ప్రకారం ఎవరి వాటా వారికి కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీశైలం, శ్రీనివాసులు, సైదులు, అశోక్, కృష్ణయ్య, బాల్‌నారి, శివ పాల్గొన్నారు.

నాలుగో రోజుకు చేరిన జెన్‌కో ఆర్టిజన్ల దీక్ష



ఈగలపెంట జెన్‌కో కార్యాలయం ఎదుట దీక్షలో కూర్చున్న ఆర్టిజన్లు

దోమలపెంట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆర్టిజన్లు చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారం నాలుగో రోజుకు చేరింది. రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని శ్రీశైలం ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రం సీఈ కార్యాలయం ఎదుట విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్లు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఇప్పటికీ యాజమాన్యం తీరులో ఎటువంటి చలనం లేదని ఆర్టిజన్లు ఆవేదన వ్యక్తం చేశారు. జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో జోసెఫ్, శ్రీనివాసులు, కుమార్, మల్లికార్జున్‌రావు, బాలకృష్ణ, శంకర్ దీక్షలో పాల్గొనగా, వారికి 1535 యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుంకరి లవకుమార్, 327 యూనియన్ ప్రధాన కార్యదర్శి అశోక్, ఏఐటీయూసీ లక్ష్మయ్య, సీఐటీయూ కిషన్, సుబ్బారెడ్డి, మల్లేష్‌రెడ్డి, ఇబ్రహీం, ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు అనిల్‌కుమార్‌గౌడ్, రామ్మోహన్ సంఘీభావం ప్రకటించారు.

విద్యార్థుల ఉన్నతికి చేయూతనిస్తాం

» పాలెం పూర్వ విద్యార్థుల సేవా సమితి కార్యదర్శి మోహన్‌బాబు

» హెచ్‌సీయూలో సీట్లు సాధించిన వారికి నగదు ప్రోత్సాహకాలు



మాట్లాడుతున్న పాలెం పూర్వ విద్యార్థుల సేవా సమితి కార్యదర్శి మోహన్‌బాబు

బిజినేపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించడానికి పాలెం పూర్వ విద్యార్థుల సేవా సమితి ఎల్లప్పుడూ చేయూతనిస్తుందని సమితి కార్యదర్శి మోహన్ బాబు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని పాలెం ప్రభుత్వ ఎస్వీ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ అటానమస్ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ వి.రాములు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పోటీ ప్రపంచంలో పాలెం విద్యార్థులు ముందుండాలని సూచించారు. 60 ఏళ్లుగా కళాశాల విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా గతేడాది వివిధ కోర్సుల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు, సెంట్రల్ యూనివర్సిటీలో సీట్లు సాధించిన 20 మంది విద్యార్థులకు ప్రోత్సాహకంగా నగదు చెక్కులను అందజేశారు. అలాగే గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, పరుగుపందెం, చెస్, క్రికెట్, వ్యాసరచన, పద్య పఠనం పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, లైబ్రేరియన్ వర్కాల శ్రీనివాసులు, అధ్యాపకులు నాగరాజు, సుష్మ శివ, రాధాకుమారి, స్వప్న, నాగలింగం, వెంకటేష్, రవికుమార్, రమేష్, మనోజ్‌కుమార్, నందు యాదగిరి, మహేశ్వర్, ప్రకాష్ ప్రవళిక, రమ్య పాల్గొన్నారు.

భూ భారతి..
రైతు హారతి

(5వ పేజీ తరువాయి..)

ప్రవేశపెట్టడం, గవర్నర్ కూడా అందుకు ఆమోదం తెలపడం రెండూ జరిగిపోయాయి. ఈ క్రమంలో ధరణి, భూ భారతిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక సర్వే నిర్వహించింది.

వీఆర్‌వోలు కావాలి...

గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థలో చాలా కీలకమైన గ్రామ రెవెన్యూ అధికారుల స్థాయిలో తీవ్ర అవినీతి జరుగుతోందని, ఆ వ్యవస్థను సమూలంగా రద్దు చేసింది. ఆ ఉద్యోగులను ఇతర శాఖల్లో జూనియర్ అసిస్టెంట్ స్థాయిలో సర్దుబాటు చేసింది. అయితే ఆ వ్యవస్థ రద్దు అయిన తర్వాత గ్రామ స్థాయిలో భూములకు సంబంధించి వీఆర్‌ఏలతో కొంత సమాచారం రైతులకు దొరికేది. ఆ తర్వాత ఆ వ్యవస్థను కూడా రద్దు చేశారు. దీంతో ఇంటర్నెట్ సెంటర్ల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. గతంలో అనధికారికంగా జరిగే డోపిడీని ఫీజు రూపంలో ప్రభుత్వం అధికారికంగా చేసిందని చాలామంది ప్రజలు అభిప్రాయపడ్డారు. కానీ, స్థానికంగా అధికారి ఉంటే చాలా సమస్యలు పరిష్కారమయ్యేవని తెలిపారు. తాజా బిల్లులో ప్రభుత్వం వీఆర్‌వో వ్యవస్థ స్థానంలో గ్రామ రెవెన్యూ అధికారులను నియమిస్తామనడం చాలా సంతోషమని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మండల స్థాయిలో అయ్యే పనులన్నీ ఆయనకు అప్పగించి చేయించుకోవచ్చని చాలామంది రైతులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 2600 మందిని సర్వే చేయగా దాదాపు 75 శాతం మంది ప్రజలు వీఆర్ఓ వ్యవస్థ ఉండాలని చెప్పారు. ధరణిని రద్దు చేయడం సరైనదేనా అనే ప్రశ్నకు కూడా దాదాపు 70 శాతం మంది ప్రజలు మంచి పరిణామని హర్షం వ్యక్తం చేశారు.

అనుభవదారులుంటే హక్కులు..

పాత పట్టాదారు పాసుపుస్తకాలు, పట్టాదారు, అనుభవదారు అనే రెండు కాలాలు ఉండేవి. పట్టాదారులు కొందరే ఉన్నా అనుభవదారులు చాలామంది ఉండేవారు. కాలక్రమంలో కొందరు అనుభవదారులు పట్టాదారులుగా మారినా ఇంకా కొందరు అలాగే ఉన్నారు. ఉదాహరణకు రాజులు, పెత్తందారులు, భూస్వాములు ఏళ్ల క్రితం వదిలి వెళ్లిన భూముల్లో సాగుచేస్తూ జీవించేవారు. అయితే ధరణి పాసుపుస్తకాల్లో ఈ అనుభవదారు కాలం తొలగిస్తూ పట్టాదారులకే పూర్తి అధికారాలను గత ప్రభుత్వం కట్టబెట్టింది. దీంతో తమకు భూములు ఉన్నాయని తెలియని వారు కూడా ధరణి పాసుపుస్తకాలు రావడంతో కాస్తులో ఉన్న వారి వద్దకు వెళ్లి తమ భూమి అని వాదించి వివాదాలు చెలరేగడం కూడా జరిగింది. ఈ నేపథ్యంలో కాస్తు కాలం కచ్చితంగా ఉంటేనే తమకు హక్కులు ఉంటాయని చాలామంది పట్టాలు లేని రైతులు అభిప్రాయపడ్డారు. కేవలం భూస్వాములకు మేలు చేసేలా ధరణిని రూపొందించారని ఆరోపించారు. ఇప్పుడు ఈ కాస్తు కాలం తేవడం కూడా హర్షణీయమని అంటున్నారు. దాదాపు 60 శాతం మంది కాస్తుకాలం ఉండాలంటే 40 శాతం మంది వద్దని సమాధానమిచ్చారు. ఇక సాదాబైనామాలు రిజిస్ట్రేషన్లు చేయాలా అనే ప్రశ్నకు కూడా 60:40 నిష్పత్తిలో ప్రజలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

వీఆర్‌వో వ్యవస్థ ఉండాలి

గ్రామాల్లో గతంలో మాదిరిగా వీఆర్‌వో వ్యవస్థ ఉండాలి. స్థానికంగా అధికారి లేకపోవడం వల్ల భూ వివాదాల పరిష్కారంలో చొరవ తక్కువైంది. రైతులు మండల కేంద్రాలకు వెళ్లి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆన్‌లైన్ సిస్టం, సమస్యలపై రైతులకు అవగాహన లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వీఆర్‌వో వ్యవస్థను తీసుకువచ్చి పారదర్శకంగా సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– గోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, నారాయణపేట

ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు చేయాల్సిందే

– రిలే దీక్షలు చేపట్టిన పెద్ద ధన్వాడ రైతులు

రాజోలి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద ధన్వాడ గ్రామం శివారులో ఏర్పాటు చేస్తున్న జీఆర్ఎఫ్ ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు చేయాలని కోరుతూ పెద్ద ధన్వాడలో గురువారం ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో రైతులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు నర్సింహులు మాట్లాడుతూ, ఫ్యాక్టరీ నిర్మాణం వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడతారని, పచ్చని పంటపొలాలు ఎండిపోతాయని, ప్రశాంతమైన వాతావరణం విషపూరితంగా మారుతుందని అన్నారు. ఫ్యాక్టరీ వల్ల లాభాల కంటే అనర్థాలే ఎక్కువ అని, అందువల్లే ఫ్యాక్టరీని రద్దు చేసే వరకు నిరాహార దీక్ష చేపడతామని, పోరాడుతామని అన్నారు. వీరికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దస్తగిరి, జిల్లా కార్యదర్శి హసాన్, యుత్ అధ్యక్షుడు, నాయకులు ఘటనా స్థలానికి చేరుకుని రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.


నత్తనడకన పన్ను వసూళ్లు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలోని 441 గ్రామ పంచాయతీలలో పన్ను వసూళ్లు నత్తనడకన సాగుతోంది. గతేడాది జనవరి నాటికి 80శాతం వసూలు చేశారు. మార్చి నాటికి 94 శాతం వసూలు చేశారు. ఈ ఏడాది అందుకు భిన్నంగా కార్యక్రమం సాగుతోంది. సోమవారం వరకు కేవలం 20 శాతం మాత్రమే పన్నులు వసూళు చేశారు. రెండు రోజులుగా ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు పన్ను బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించడంతో బుధవారం మధ్యాహ్నం వరకు పన్ను వసూలు శాతం 35.63కు చేరింది. మొత్తం జిల్లాలోని 441 గ్రామ పంచాయతీలలో 1,77,858 ఇంటి నిర్మాణాలు ఉన్నాయి. వాటి నుంచి ప్రభుత్వానికి రూ. 7,56,54,525 పన్నుల రూపేణ రావాల్సి ఉంది. కాని నేటి వరకు కేవలం రూ. 2,69,57,059 మాత్రమే వసూలు చేశారు. ఇంకా రూ. 4,86,97,466లు పెండింగ్‌లో ఉన్నాయి. మార్చి నాటికి ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. 2025 మార్చి చివరి నాటికి 100శాతం పన్ను బకాయిలను పంచాయతీ కార్యదర్శులు వసూలు చేయాల్సి ఉంది. జిల్లాలో అత్యధికంగా 62 శాతం మహబూబ్‌నగర్ మండలంలో వసూలు చేశారు. అత్యల్పంగా నవాబ్‌పేట మండలంలో 20 శాతం మాత్రమే వసూలు చేశారు. దీంతో అధికారులు పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. మార్చి నాటికి పూర్తికాకపోతే ఏప్రిల్ వరకు గడువును పెంచే అవకాశం ఉంది.

పంచాయతీ కార్యదర్శులకు పనిభారం..

జిల్లాలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పనిభారంతో అనుకున్న స్థాయిలో పన్నులు వసూలు చేయలేకపోతున్నారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ, వాటి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ, కులగణన, సీఎంకప్ క్రీడల నిర్వహణ, పంచాయతీ ఎన్నికల ముసాయిదా ఓటరు జాబితా, వాటి ప్రదర్శన, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ఇలా వివిధ పనులు అప్పగించడంతో వారు పన్ను బకాయిలతో పాటు, గ్రామాలలో నిత్యం చేపట్టే కార్యక్రమాలు సైతం నిర్వహించలేకపోతున్నారు. దీంతో పన్ను వసూలు ప్రక్రియ నత్తనడకన సాగుతోందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

మార్చి నాటికి 100 శాతం వసూలు చేస్తాం..



జిల్లాలోని 441 గ్రామ పంచాయతీలలో మార్చి నాటికి 100 శాతం పన్ను బకాయిలను వసూలు చేస్తాం. ఇప్పటికే ఎంపీవోలతో, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక కార్యక్రమాలను రూపొందిస్తున్నాం. గతేడాది జనవరి నాటికి 80 శాతం పన్నులు వసూలు చేశాం. మొత్తంగా 94 శాతం వసూలు చేశాం. ఈ ఏడాది కార్యదర్శులు ఇతర పనులల్లో నిమగ్నం కావడంతో వెనుకబడి ఉన్నాం. రెండురోజుల క్రితం వరకు 20 శాతం వరకు పన్నుల రికవరి బుధవారం నాటికి 35.63 శాతం వరకు చేరింది. మార్చి నాటికి 100 శాతం పూర్తి చేస్తాం. అందుకు గ్రామాలలో ప్రజల అవగాహన కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాం.

– పార్థసారథి, డీపీవో

పార్టీలకు అతీతంగా పట్టణాభివృద్ధి

– రూ.750 కోట్ల నివేదికతో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు

– మునిసిపల్ చివరి సమావేశంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ




సమావేశానికి హాజరైన కౌన్సిల్ సభ్యులు

మహబూబ్‌నగర్ అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా మహబూబ్‌నగర్ పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మునిసిపల్ సమావేశ మందిరంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన చివరి కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహబూబ్‌నగర్ మునిసిపల్‌కు లభించాల్సిన గౌరవం గతంలో లభించలేదని, రాష్ట్రంలోనే 139 మునిసిపాలిటీలలో మహబూబ్‌నగర్ జిల్లా రెండో స్థానంలో ఉన్నా తగిన గుర్తింపు లభించలేదన్నారు. చిన్న మునిసిపాలిటీలను కార్పొరేషన్ చేసుకుని ఎంతో అభివృద్ధి చేసుకున్నా మన మహబూబ్‌నగర్‌కు మాత్రం ఆ గుర్తింపు లేకపోవడం దురదృష్టకరమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఎలాగైనా మహబూబ్‌నగర్‌ను కార్పొరేషన్ చేయాలని కోరిన వెంటనే అమలు చేయడం జరిగిందన్నారు. గడిచిన నాలుగు సంవత్సరాల వ్యవధిలో 12 మార్లు కౌన్సిల్ సమావేశాలు జరిగితే, మన ప్రభుత్వ హయాంలో ఏడాది కాలంలోనే 10 కౌన్సిల్ సమావేశాలు జరగడమే అభివృద్ధికి నిదర్శనమన్నారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ఓట్ల గుర్చి ఆలోచన చేయాలని, ఎన్నికల తరువాత అందరి ఎజెండా అభివృద్ధి కావాలని, ఆ దిశగానే మన అందరం ముందుకు సాగడం చాలా సంతోషకరమన్నారు.

పట్టణ అభివృద్ధికి కృషి : ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ డీకే అరుణ అన్నారు. కేంద్రం నుంచి మునిసిపాలిటీ నిధులు తెస్తానాని, కేంద్ర ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానని వెల్లడించారు. పార్టీలకు అతీతంగా జిల్లా అభివృద్ధికి పాటుపడుదామన్నారు.

వార్డులలో అభివృద్ధి చేసుకున్నాం : మునిసిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్



ప్రతీ వార్డులో అవసరం మేరకు అభివృద్ధి పనులను వేగవంతంగా చేసుకున్నామని మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ అన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పూర్తిగా స్వేచ్ఛ ఇచ్చినందుకే ఇది సాధ్యమైందని తెలిపారు. మీ అందరి సహకారం ఎప్పటికీ మరువలేనని, పారిశుధ్య కార్మికులు ఎంతో శ్రమించి పట్టణాన్ని పరిశుభ్రంగా చేశారని తెలిపారు. అన్ని శాఖల అధికారులు చాలా పకడ్బందీగా పని చేయడంతోనే వేగంగా అభివృద్ధి జరిగిందని అన్నారు.

మీ సహకారంతోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే యెన్నం



ఏడాది కాలంలోనే మునిసిపాలిటీలో అన్ని వార్డులలో దాదాపు రూ.200 కోట్ల అభివృద్ధి పనులు చేశామని, మరిన్ని పనులు చివరి దశలో ఉన్నాయని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రతీ వార్డుకు అవసరం మేరకు నిధులను సమకూర్చామని తెలిపారు. పార్టీలను చూడలేదని, ప్రజలకు ఏది అవసరమో వాటిని పూర్తి చేయడమే లక్ష్యంగా పని చేశామన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, అధికారులు ఎంతో శ్రమించి ప్రజలకు మంచి చేశారని అన్నారు. మునుముందు మీ అందరూ కార్పొరేటర్లుగా గెలిచి మరింత అభివృద్ధికి తోడ్పాటును అందించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు.

మహబూబ్‌నగర్ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ నిధులు వచ్చేందుకు గాను ఇప్పటికే రూ.750 కోట్లు అవసరం ఉందని నివేదికను పంపించడం జరిగిందని తెలిపారు. ఫిబ్రవరి మొదటివారంలో జరుగనున్న అసెంబ్లీ సమావేశాలలో రూ.400 కోట్లు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోతానని తెలిపారు. కార్పొరేషన్‌గా అడుగులు వేసినందుకు వెనువెంటనే రూ.250 కోట్లు తీసుకు వచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఏడాదిలోనే ఐదేళ్ల అభివృద్ధి : కౌన్సిలర్లు

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ ఎంతో శ్రమించి కేవలం ఏడాది కాలంలోనే ఐదేళ్లలో జరిగే అభివృద్ధి పనులు చేశారని పలువురు కౌన్సిలర్లు సంతోషం వ్యక్తం చేశారు. వైస్‌చైర్మన్ షబ్బీర్ అహ్మద్, ఎంఐఎం ఫ్లోర్ లీడర్ సాదాతుల్లా, బీజేపీ ఫ్లోర్ లీడర్ అంజయ్య, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కట్టా రవి కిషన్ రెడ్డి, కౌన్సిలర్లు రామాంజనేయులు, చెన్నవీరయ్య, గోవింద్, స్వప్న రక్షిత, ముస్తాక్, మోయిన్‌అలీ జాజిమొగ్గ నర్సింహులు, తదితరులు మాట్లాడుతూ ఎటువంటి వివక్ష చూపించలేదని, అడిగిన వెంటనే పనులు చేశారని హర్షం వ్యక్తం చేశారు.

కౌన్సిలర్ కిశోర్ మాట్లాడుతూ గత నాల్గు సంవత్సరాలలో అభివృద్ధి జరుగలేదని అన కూడదని, అప్పటి కంటే ఇప్పుడు కొంత అధికంగా పనులు జరిగాయని తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కౌన్సిల్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ బాక్స్

హెచ్‌సీఏ జట్టుకు జిల్లా క్రీడాకారులు



పి.సాయిరాం



సుప్రతీక్ గౌడ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అండర్-14 బాలుర జట్టులో జిల్లా క్రీడాకారులు స్థానం సంపాదించారు. ప్రధాన జట్టుకు పి. సాయిరాం, స్టాండ్‌బైగా సుప్రతీక్ ఎంపికయ్యారు. మహబూబ్‌నగర్‌లోని పెవిలియన్ క్రికెట్ క్లబ్‌లో శిక్షణ తీసుకుంటున్న వీరిద్దరూ హైదరాబాద్‌లోని నటరాజన్ క్రికెట్ క్లబ్ తరుపున ఇటీవల నిర్వహించిన మ్యాచ్‌లో రాణించారు. లీగ్ మ్యాచ్‌లో సాయిరాం 341 పరుగులు, అండర్-14 ప్రాబబుల్స్ మ్యాచ్‌లో 93 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. సుప్రతీక్‌గౌడ్ 16 వికెట్లు తీసి సత్తాచాటి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. విజయనగరంలో ఫిబ్రవరి ఆరవ తేదీ నుంచి ప్రారంభం కానున్న అండర్-14 బాలుర క్రికెట్ టోర్నమెంట్‌లో వీరు పాల్గొననున్నారు. వారిని పెవిలియన్ క్రికెట్ క్లబ్ కోచ్‌లు మహబూబ్ పాషా, భరత్‌గౌడ్ అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి రంజీ జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బాల బాలికలతో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దీప, రిటైర్డ్ పీఈటీ గోపాలం తదితరులు

మక్తల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు నారాయణపేట జిల్లాకు చెందిన ఐదుగురు బాలికలు, ఐదుగురు బాలురు ఎంపికైనట్లు టెన్నికాయిట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దీప తెలిపారు. నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి సందర్భంగా, టెన్నికాయిట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ ఆదేశం మేరకు గురువారం మక్తల్ పట్టణంలోని సాయిజ్యోతి ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపిక పోటీలు నిర్వహించారు. విశ్రాంత పీఈటీ గోపాలం క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన 10 మంది బాలబాలికలను రాష్ట్ర స్థాయి జూనియర్ టెన్నికాయిట్ పోటీలకు ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. బాలికల విభాగంలో స్వప్న, పల్లవి, అఖిల, సంధ్య, రేణుక, బాలుర విభాగంలో అజయ్, ఫర్హాన్, గౌతమ్, విశాల్, హరివరణ్‌రెడ్డిలు ఎంపికైనట్లు చెప్పారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో ఈ నెల 26న నిర్వహించనున్న టెన్నికాయిట్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సాయిజ్యోతి ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య, వైస్ ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి, పీఈటీలు రమేశ్ కుమార్, రవిశంకర్‌రెడ్డి, స్వప్న, రాకేశ్ పాల్గొన్నారు.

26న సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా అండర్-14 సాఫ్ట్‌బాల్ బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలను ఈ నెల 26న నిర్వహించనున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ పెడరేషన్ అండర్ - 17 కార్యదర్శి శారదాబాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని డీఎస్‌ఏ స్టేడియంలో ఈ పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు 26న మధ్యాహ్నం రెండు గంటలకు ఆధార్‌కార్డు, బోనఫైడ్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

రహదారిపై ప్రగతిరథ సారథి



రహదారిపై పరుగులు తీసే ప్రగతి రథానికి సారథి అతడు..
ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే అతడి ధ్యేయం..
విధి నిర్వహణలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, సహనంతో
అధిగమించడమే అతడికి తెలిసిన విద్య.. బస్సు ఎక్కి స్టీరింగ్
పట్టుకున్నప్పటి నుంచి, ప్రయాణికులను గమ్యస్థానానికి చేర్చేంత
వరకు అలుపెరుగని యోధుడు అతడు.. అతడే ఆర్టీసీ బస్సు డ్రైవర్..
నేడు ఆర్టీసీ డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

మహబూబ్‌నగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చడమే లక్ష్యంగా ఆర్టీసీ డ్రైవర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 10 బస్ డిపోల లో ఆర్టీసీకి చెందిన బస్సులు 476, అద్దె బస్సులు 384 ఉన్నాయి. 940 మంది డ్రైవర్లు పని చేస్తున్నారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లెగ్జరీ బస్సు సర్వీసులు కొనసాగుతున్నాయి.

ప్రతీక్షణం అప్రమత్తం

విధి నిర్వహణలో భాగంగా బస్సు ఎక్కి స్టీరింగ్ పట్టుకున్నప్పటి నుంచి డ్రైవర్ ప్రతీక్షణం అప్రమత్తంగా ఉంటాడు. ఎందుకంటే దాదాపు 50 మంది ప్రాణాలు అతడిపైనే ఆధారపడి ఉంటాయి. బస్సు కండీషన్ బాగా లేకున్నా, రోడ్లు అధ్వానంగా ఉన్నా, ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే లక్ష్యంగా డ్రైవర్లు విధులు నిర్వర్తిస్తుంటారు. ఈ క్రమంలో వారు ఎంతో ఒత్తిడికి లోనవుతుంటారు. ఒత్తిడిని తట్టుకోలేక కొందరు డ్రైవర్లు గుండుపోటుకు గురైన సందర్భాలున్నాయి. ఆ సమయంలోనూ ప్రయాణికుల సంక్షేమం కోసం ఆలోచించి, నొప్పిని భరిస్తూనే బస్సును జాగ్రత్తగా పక్కకు తీసుకెళ్లి కుప్పకూలిపోయిన సంఘటనలూ ఉన్నాయి.

కత్తిమీది సాములా విధి నిర్వహణ

ఆర్టీసీ బస్సు డ్రైవింగ్ అంటే కత్తి మీద సాము లాంటిదని చెప్పొచ్చు. విధి నిర్వహణలో ఒత్తిడితో చాలా మంది డ్రైవర్లు రిటైర్మెంట్‌కు ముందే అలసిపోతుంటారు. ప్రస్తుతం కొన్ని బస్సుల్లో కండక్టర్ ఉండటం లేదు. అప్పుడు డ్రైవరే ప్రయాణికులకు టికెట్లు (టిమ్స్) ఇచ్చే బాధ్యతను కూడా నిర్వర్తించాల్సి వస్తోంది. క్లచ్‌లు తొక్కీ, తొక్కీ, మోకాళ్లు అరిగిపోతున్నాయని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు మెడ నరాల సమస్య, గుంతల రోడ్లపై బస్సు నడిపినప్పుడు కుదుపులతో నడుము నొప్పికి గురవుతున్నారు.

పని ఒత్తిడితో బీపీ, షుగర్ లాంటి దీర్ఘ కాలిక వ్యాధుల బారిన పడుతున్నారు. బస్సుల కండీషన్ సరిగా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. క్లచ్‌లు, బ్రేక్, స్టీరింగ్ హార్డ్‌గా ఉంటే వారిపై మరింత భారం పడుతోంది. ఈ పరిస్థితుల్లో డ్రైవర్లకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఆర్టీసీ యాజమాన్యం చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఆరోగ్య పరిరక్షణపై వారికి అవగాహన కల్పించేందుకు సంస్థ ఆధ్వర్యంలో కృషి చేయాల్సి ఉంది.

మోకాళ్ల నొప్పులు వస్తున్నాయి



ఎక్కువ రోజులు బస్సు నడపడం వల్ల మోకాళ్ల నొప్పులు వస్తున్నాయి. ఈ రోజు 11 గంటలకు డ్యూటీ ఎక్కితే మరునటిరోజు మధ్యాహ్నం రెండు గంటలకు దిగాల్సి వస్తోంది. లీవులుండవు. రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఎక్కువగా ఉండటం వల్ల సమయం వృథా అవుతుంది. ఇన్ని ఇబ్బందుల మధ్యనే సకాలంలో గమ్యస్థానానికి చేరుకోవాల్సి ఉంటుంది.

\- వెంకటేశ్, డ్రైవర్

ఒత్తిడితో అనారోగ్య సమస్యలు



బస్సు డ్రైవర్‌గా 22 ఏళ్ల నుంచి పని చేస్తున్నాను. ఎంతో ఏకాగ్రతతో బస్సు నడపాల్సి ఉంటుంది. ఒత్తిడి కూడా అధికంగా ఉంటుంది. మెడ నరాలు గుంజుతాయి. మోకాళ్ల సమస్యలు వస్తున్నాయి. ప్రయాణికులను సురక్షితంగా తీసుకెళ్లడం ఒక్కటే మాకు తెలుసు. బస్సు ఎక్కినప్పటి నుంచి వారిని గమ్యస్థానాలకు చేర్చే వరకు వారి బాధ్యత మాదే. అందుకే చాలా ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తోంది.

\- ఇసాక్, డ్రైవర్

డిపోల వారీగా వివరాలు

డిపో	బస్సులు	డ్రైవర్లు
1. అచ్చంపేట	48	95
2. షాద్‌నగర్	52	104
3. గద్వాల	52	111
4. కల్వకుర్తి	60	111
5. కొల్లాపూర్	35	74
6. కోస్గి	17	33
7. మహబూబ్‌నగర్	64	129
8. నాగర్‌కర్నూల్	42	84
9. నారాయణపేట	44	82
10. వనపర్తి	62	117
మొత్తం	476	940

ఆయిల్ పామ్ సాగు పెంపునకు కృషి

» ఆయిల్ ఫెడ్ రాష్ట్ర సంచాలకులు యాస్మిన్‌బాషా » ఎర్రవల్లి మండల పరిధిలోని విజయ ఆయిల్ మిల్లు పరిశీలన



ఇటిక్యాల గ్రామశివారులో ఆయిల్ పామ్ తోటను పరిశీలిస్తున్న ఆయిల్ ఫెడ్ రాష్ట్ర సంచాలకులు యాస్మిన్ బాషా

ఎర్రవల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : పామాయిల్ సాగును పెంచేందుకు అధికారులు మరింత కృషి చేయాలని ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ రాష్ట్ర సంచాలకులు యాస్మిన్‌బాషా అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా, ఎర్రవల్లి మండల పరిధిలోని విజయ ఆయిల్ మిల్లును గురువారం ఆమె పరిశీలించారు. అధికారులతో మాట్లాడి జిల్లాలో ఆయిల్ పామ్ సాగు వివరాలను తెలుసు కున్నారు. మిల్లు పునరుద్ధరణ పనులు త్వరలోనే ప్రారంభం అవుతాయన్నారు. అనంతరం ఇటిక్యాల మండలంలోని మునుగాల శివారులో పామాయిల్‌తోటను పరిశీలించారు. రైతు హనుమంతురెడ్డితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం పంట దశ గురించి ఆయనతో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ రైతులతో సమావేశం నిర్వహించి ఉద్యానవన శాఖ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. సాగు పెంపు దిశగా ప్రణాళికలను రూపొందించాలని చెప్పారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, పలు సూచనలు, సలహాలు చేశారు. ఆ తర్వాత కలెక్టర్‌తో సమావేశమై వివరాలను తెలిపినట్లు సమాచారం. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి అక్బర్, ఆయిల్ ఫెడ్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారులు ఇమ్రాన్, రాజశేఖర్, మహేశ్, జిల్లా ఇన్ చార్జి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యం భరించలేక వ్యక్తి ఆత్మహత్య

మరికల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మరికల్ మండలం, జిన్నారం గ్రామానికి చెందిన తిరుపతి రెడ్డి (40) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసు కున్నాడు. ఎస్‌ఐ రాములు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తిరుపతిరెడ్డికి గతంలో గుండె ఆపరేషన్ అయ్యింది. అప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీనికి తోడు మతిస్థిమితం కూడా సరిగా లేదు. దీంతో మనోవేదనకు గురైన ఆయన బుధవారం రాత్రి కుటుంబ సభ్యులందరూ భోజనం చేసి నిద్రపోయిన తర్వాత ఇంటినుంచి బయటకు వచ్చాడు. గ్రామంలోని వీరయ్య దుకాణం పక్కనున్న వేపచెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. తల్లి హన్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

» ఆత్మహత్యాయత్నం చేసి ఒకరు..
» రోడ్డు ప్రమాదంలో గాయపడి మరొకరు..

అయిజ టౌన్/ భూత్పూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు. జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మునిసిపాలిటీ పరిధిలోని పర్దిపురం గ్రామానికి చెందిన వెంకట్రాములుకు ముగ్గురు కుమారులున్నారు. రెండవ కుమారుడు తిప్పన్న (22) గత శనివారం తండ్రితో గొడవపడి పొలం వద్దకు వెళ్లి గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని కర్నూల్ ఆసుపత్రికి తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని కొత్తమొల్గర గ్రామానికి చెందిన లింగాల తిరుపతయ్య (40) ఈ నెల 22న రాత్రి నాగర్‌కర్నూల్ రోడ్డుపై నడుచుకుంటూ వస్తుండగా, మహబూబ్‌నగర్ వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొన్నది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయనను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. ఆయనకు భార్య శాతమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి తల్లి లింగాల నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న ఇసుక పట్టివేత

» రెండు ట్రాక్టర్లు, ఒక టిప్పర్ స్వాధీనం

వీపనగండ్ల/ అలంపూర్ చౌరస్తా, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, ఒక టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో ఈ సంఘటనలు జరిగాయి. వీపనగండ్ల ఎస్‌ఐ రాణి, ఉండవల్లి ఎస్‌ఐ మహేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వీపనగండ్ల మండలంలోని తూముకుంట వాగు నుంచి రెండు ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అనుమతి లేదని గుర్తించి స్టేషన్‌కు తరలించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కర్నూలు జిల్లా, తాండ్రపాడు శివారులోని తుంగభద్ర నది నుంచి గద్వాల అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను ఉండవల్లి మండల పరిధిలోని భైరపురం గ్రామంలో బ్లూకోల్ట్ సిబ్బంది పట్టుకున్నారు. డ్రైవర్ కిరణ్, యజమాని రాజశేఖర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. దాడుల్లో బ్లూకోల్ట్ సిబ్బంది అబ్దుల్, మద్దిలేటి పాల్గొన్నారు.

మహిళపై చీటింగ్ కేసు నమోదు

గద్వాల క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : హౌసింగ్‌లోన్ పేరుతో మోసం చేసిన మహిళపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన వీరావతి అనే మహిళ, హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన విమల అనే ఉద్యోగినికి హోమ్‌లోన్ పేరుతో రూ. 90 లక్షలు ఇప్పించింది. మీరు గతంలో తీసుకున్న రుణాలను క్లియర్ చేసి నో డ్యూస్ సర్టిఫికెట్ ఇప్పిస్తామని చెప్పి అందులో నుంచి రూ. 16 లక్షలను తన ఖాతాలో వేయించుకున్నది. కానీ పాత రుణాలను క్లియర్ చేయించలేదు. నగదును కూడా తిరిగి ఇవ్వలేదు. ఈ విషయంపై బాధితురాలు విమల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వీరావతిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

తాడూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, తాడూరు మండల కేంద్రంలోని పురాతన గృహంలో గుప్త నిధుల తవ్వకం కలకలం సృష్టించింది. సీఐ కనకయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తిరుపతయ్య, రాములు వారికి సంబంధించిన పాత ఇంట్లో బుధవారం రాత్రి తవ్వకాలు చేపట్టారు. విషయాన్ని గమనించిన చుట్టుపక్కల సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొనేలోగానే పరారయ్యారు. అక్కడున్న ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

గ్రామ సభల పేరుతో కాంగ్రెస్ డ్రామా

» బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యే విజయుడులకు జ్ఞాపికను అందిస్తున్న వెంకట్రామయ్య శెట్టి

అలంపూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామ సభలు డ్రామాగా మారాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా జోగుళాంబ గద్వాల జిల్లా, అలంపూర్‌లో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఇల్లూరి వెంకట్రామయ్య శెట్టి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కవి సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే విజయుడుతో కలిసి ఎంపీడీవో కార్యాలయం వద్దనున్న అంబేడ్కర్, పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. లక్ష డప్పులు, వెయ్యి గొంతులు కార్యక్రమానికి డప్పు కొట్టి సంఘీభావం తెలి పారు. బ్రాహ్మణ వీధిలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనంలో మాట్లాడారు. కాంగ్రెస్ కార్యకర్తలు సూచించిన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ చెప్తున్నారన్నారు. అలాగే నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి కూడా తాము చెప్పిన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని బహిరంగంగా చెప్తున్నారని విమర్శించారు. అర్హత లేని వారు గ్రామసభ వేదికలపై కూర్చొని అధికారుల నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నారని, ఇది చట్ట వ్యతిరేకమని చెప్పారు. సర్పంచు ఎన్నికలు నిర్వహించడం లేదని, గత ప్రభుత్వంలో సర్పంచులు చేసిన పనులకు బిల్లులు ఇవ్వడం లేదని విమర్శించారు. ఇప్పటి వరకు గ్రామాలకు చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదన్నారు. గ్రామ సభల పేరుతో చేస్తున్న డ్రామాలను ఆపేసి అర్హులైన వారందరికీ పథకాలను వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. అంతకు ముందు ప్రజాకవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న పాడిన పాటలు అందరినీ ఆకట్టు కున్నాయి. మాంటిస్సోరి విద్యార్థుల నృత్య ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో ముని సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, నాయకులు ఉప్పల వెంకటేష్ గుప్త, రవి ప్రకాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎంపీటీసీ మాజీ సభ్యుడి మృతి

» నివాళి అర్పించిన నాయకులు, ప్రజాప్రతినిధులు



అమ్మునాయక్ (ఫైల్)

పెద్దకొత్తపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఎంపీటీసీ మాజీ సభ్యుడు మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండలంలోని వేడుకరావుపల్లి తండాలో గురువారం ఈ సంఘటన జరిగింది. తండాకు చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు, రైతు అమ్మునాయక్ (58) గురువారం ఉదయం పొలానికి వెళ్లాడు. అక్కడ బోరు స్టార్టర్‌ను సరి చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన భార్య మంగమ్మ కూడా గతంలో ఎంపీటీసీ సభ్యురాలిగా పని చేశారు. వారికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న పలువురు ఆయనకు నివాళి అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారిలో తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు, కొల్లాపూర్ జడ్పీటీసీ సభ్యుడు హనుమంతునాయక్, గిరిజన సంఘం సంఘం నాయకుడు శంకర్‌నాయక్, పెద్దకొత్తపల్లి మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు గౌరమ్మ, చంద్రయ్యయాదవ్, మైసమ్మ ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు దండు నరసింహ తదితరులు ఉన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు విద్యార్థినుల అదృశ్యం

» వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఘటన

ఖిల్లాఘణపురం/ అచ్చంపేట టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు చోట్ల ఇద్దరు విద్యార్థినులు అదృశ్యమయ్యారు. వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండలానికి చెందిన ఓ విద్యార్థిని జిల్లా కేంద్రంలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతోంది. ఈనెల 22న కళాశాలకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు కాలేజీకి వెళ్లి ఆరా తీయగా రాలేదని అధ్యాపకులు తెలిపారు. దీంతో వారు గ్రామానికి చెందిన కుమార్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. అలాగే నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన యువతి అచ్చంపేట పట్టణంలో డిగ్రీ చదువుతోంది. బుధవారం తల్లిదండ్రులు పొలానికి వెళ్లి తిరిగి వచ్చే సరికి కుమార్తె కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పవన్ తెలిపారు.

నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్

» నారాయణపేట డీఎస్పీ లింగయ్య
» 160 ఇళ్లలో సోదాలు, వాహనాల స్వాధీనం



గ్రామస్థులకు సూచనలు, సలహాలు చేస్తున్న డీఎస్పీ లింగయ్య

నారాయణపేట టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహిస్తున్నామని డీఎస్పీ లింగయ్య అన్నారు. పట్టణంలోని బాహర్ పేట్‌లో గురువారం ఉదయం కమ్యూనిటీ కాం టాక్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా 160 ఇళ్లలో సోదాలు నిర్వహించి సరైన పత్రాలు లేని వాహనాలను, వ్యక్తుల వివరాలను సేకరించారు. 35 ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలను సీజ్ చేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత వివరాలను గుర్తు తెలియని వ్యక్తులకు తెలుపొద్దని సూచించారు. ప్రతీ ఒక్కరు వ్యక్తిగత భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

న్యూస్ బాక్స్

పని ఒత్తిడి తగ్గించేందుకు క్రీడలు దోహదం

- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : నిత్యం బిజీగా ఉండే పోలీసులకు క్రీడలు మానసిక, శారీరక ధృడత్వాన్ని కలిగించడంతో పాటు పని ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తాయని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని క్రీడా మైదానంలో 2025 పోలీస్ వార్షిక క్రీడల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి జూపల్లి శాసన మండలి సభ్యుడు కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌లు హాజరయ్యారు. వివిధ స్థాయిల పోలీస్ అధికారులకు మూడు రోజులుగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విజేతలకు మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్సీ, ఎస్పీ బహుమతులను ప్రదానం చేశారు. ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ పోలీస్ అధికారులు 24గంటల తమ విధులను ప్రజల సంరక్షణకు పాటుపడుతూ ఉంటారని, వారు పని ఒత్తిడికి గురి కాకుండా ఉండేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. ప్రతీ రోజు విధులు నిర్వహించే అధికారులకు, సిబ్బందికి ఆటవిడుపుగా ఇలాంటి క్రీడల్లో పాల్గొని మానసిక ఉల్లాసాన్ని పొందారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రామేశ్వర్, భరత్‌కుమార్, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ కనకయ్య ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మైనార్టీ బాలికల గురుకులాల్లో ఉద్యోగాలకు దరఖాస్తులు

కల్వకుర్తి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో అవుట్ సోర్సింగ్ పద్ధతిన ఇంగ్లీష్ మీడియంలో బోధించేందుకు పీజీటీ బయోసైన్స్, టీజీటీ సైన్స్ పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్మయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పీజీటీ బయోసైన్స్ పోస్టుకు సంబంధిత సబ్జెక్టులో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొంది బీఈడీ పూర్తి చేసిన మహిళలు అర్హులని తెలిపారు. టీజీటీ పోస్టుకు సంబంధిత సబ్జెక్టు డిగ్రీతో పాటు బీఈడీ పూర్తి టెట్ పాసైన మహిళలు అర్హులని పేర్కొన్నా రు. అర్హత కలిగిన మహిళలు ఈనెల 30వ తేదీలోపు కల్వకుర్తి మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఈదమ్మ జాతర భూమి అద్దె వేలం పాట

కొల్లాపూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మునిసిపల్ కార్యాలయంలో గురువారం ఈదమ్మ జాతర భూమి కిరాయి వేలం పాట జరిగింది. ఈ వేలం పాటలో మహేష్ (టీ హోటల్) అత్యధికంగా రూ.3 లక్షలు ఈదమ్మ భూమి జాతర వేలంలో పాట పాడి సొంతం చేసుకున్నారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈదమ్మ జాతర ఉత్సవాలు నాలుగు వారాల పాటు ఘనంగా కొనసాగనున్నాయి. భక్తుల కు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు మునిసి పల్ చైర్ పర్సన్ మేకల రమ్య కమిషనర్ శ్రీనివాసన్ పేర్కొన్నారు.

డంపింగ్‌యార్డు కూల్చిన వారిని అరెస్టు చేయాలి : బీజేపీ

పెద్దకొత్తపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నకార్పాముల గ్రామ శివారులో ప్రభుత్వం నిర్మించిన డంపింగ్ యార్డును కూల్చిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు దేశమోని పరశు రాముడు కోరారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం ఎంపీడీవోకు వినతపత్రం అందజేశారు. డంపింగ్ యార్డును కూల్చి, ప్రజాధనాన్ని వృధా చేసిన వారిపై చర్యలు తీసుకొని, వారి నుంచి రికవరీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మేకల శివయాదవ్, జిల్లా కౌన్సిల్ మెంబరు పదిర భీమేష్‌రెడ్డి, సీనియర్ నాయకులు తిరుమల్‌యాదవ్, కోట్ల సుధాకర్‌రావు, అమ్మపల్లి మల్లేష్, శేఖర్‌యాదవ్, పెబ్బేటి విజయ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల తోడ్పాటు

నాగర్‌కర్నూల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : కుమ్మెర గ్రామంలో ఇంద్రజ భర్త అకాల మరణం చెందాడు. విషయం తెలుసుకున్న ఆమె స్నేహితులైన 2009 ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు కలిసి రూ.70వేలు సమకూర్చి గురువారం ఆమెకు అందజేశారు. తమతో చదువుకున్న వారికి ఏ ఆపద వచ్చిన ఆదుకుంటామని వారు అన్నారు.

'విద్యుత్ బిల్లులు చెల్లించాలి'

వెల్దండ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించి విద్యుత్‌శాఖకు సహకరించాలని కల్వకుర్తి ఏడీఈ శంకర్ కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఏఈ సూర్యంనాయక్, విద్యుత్ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో ఉన్న విద్యుత్ సమస్యలపై ఆరాతీశారు.

పోరాటాల ఫలితమే హమాలీల రేట్ల పెంపు

కొల్లాపూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) :సిఐటియు కార్మిక సంఘాల ప్రణాళిక బద్ధ పోరాట పటిమ ఫలితమే సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల రేట్ల పెరుగుదలకు కారణం అని సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ అన్నారు. గురువారం కొల్లాపూర్ సివిల్ సప్లయ్ గోదాం దగ్గర సివిల్ సప్లయ్ హమాలీల విజయోత్సవ సభ నిర్వహించారు. కొల్లాపూర్ సివిల్‌సప్లయ్ స్టాక్ పాయింట్ అధ్యక్షుడు బురాన్, గోపాల్, కుర్మయ్య, బలరాం, మహబూబ్, రమేష్, సుధాకర్, మల్లేష్, మహేష్, స్వామి, లింగస్వామి పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి

సంక్షేమ పథకాలు



కుర్మిద్ద గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, చిత్రంలో ఎంపీ మల్లు రవి

- కొల్లాపూర్‌లో కలెక్టర్ సంతోష్
- కల్వకుర్తి, లింగాల సభల్లో పాల్గొన్న నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ

కొల్లాపూర్/ పెద్దకొత్తపల్లి/ కల్వకుర్తి/ లింగాల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో (నరసింగరావుపల్లి) గ్రామంలో గురువారం నిర్వహించిన వార్డు సభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించేందుకు, అనర్హులను ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా చూసేందుకు నిర్వహిస్తున్న గ్రామ, వార్డు సభలను అర్హులు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాల కోసం అర్హత కలిగిన వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో భన్సీలాల్, నోడల్ ఆఫీసర్ యాదగిరి, మునిసిపల్ క మిషనర్ శ్రీనివాసన్, కొల్లా పూర్ మునిసిపల్ చైర్ ప ర్సన్ మేకల రమ్య, తహసీ ల్దార్ విష్ణువర్దన్ రావు, మునిసిపల్ కౌన్సిలర్ చిట్టెమ్మ, ప్ర జాప్రతినిధులు, గ్రామస్తులు , ప్రజలు పాల్గొన్నారు.

● పెద్దకొత్తపల్లి : మండలంలోని వెన్నచెర్ల గ్రామంలో జరిగిన ప్రజా పాలన గ్రామసభకు కలెక్టర్ బదావత్ సంతోష్ హాజరయ్యారు. గ్రామ సభలో అధికారులు ప్రాథమికంగా సేకరించిన అర్హుల సమాచారాన్ని అధికారులు చదివి విన్పించారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు రవి కుమార్, ఆర్డీవో భన్సీలాల్, నోడల్ ఆఫీసర్ యా దగిరి, తహసీల్దార్ జేకే.మోహన్, సింగిల్ విండో మాజీ చైర్మన్ డి.బాలస్వామి, నాయకులు బాలింగాచారి, రాముడు, నాగేంద్రం, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు, ప్రజలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు దశలవారీగా అందిస్తామని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గురువారం కల్వకుర్తి మండలంలోని కుర్మిద్దలో జరిగిన ప్రజాపాలన గ్రామసభకు ఎంపీ, ఎమ్మెల్యే ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి దరఖాస్తులను వారు స్వీకరించారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోలు బోర్డు సభ్యుడు ఠాకూర్ బాలాజీసింగ్, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, మార్కెట్ చైర్మన్ మనీలా సంజీవ్‌కుమార్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ అశోక్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్‌రెడ్డి, తహసీల్దార్ ఇబ్రహీం, ఎంపీడీవో వెంకటరాములు, స్థానిక నాయకులు దామోదర్ గౌడ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే వంశీకృష్ణ

లింగాల : రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమమ పథకాల అమలుకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మండలంలో మూడవరోజు కొనసాగిన గ్రామ సభల్లో భాగంగా గురువారం మండల పరిధిలోని కొత్త చెర్వుతండా, మగ్దూంపూర్ గ్రామాలలో నిర్వహించిన గ్రామ సభల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి సీతారాంనాయక్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపా ధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ కొండల్‌రావు, ఆయా శాఖల మండల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



కొల్లాపూర్ మునిసిపాలిటీ 14వ వార్డు సభకు హాజరై మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్, చిత్రంలో మునిసిపల్ చైర్ పర్సన్ రమ్య



లింగాల మండలం మగ్దూంపూర్ గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

సుభాష్ చంద్రబోస్ జీవితం అందరికి స్ఫూర్తి

-నవోదయ ప్రిన్సిపాల్ పి.భాస్కర్ కుమార్

నాగర్‌కర్నూల్‌టౌన్/ కొల్లాపూర్/ బిజినేపల్లి/ ఊర్కొండ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాటయోధుడు సుభాష్ చంద్రబోస్ జీవితం మనందరికీ స్ఫూర్తి కలిగిస్తుందని జవహర్ నవోదయ పాఠశాల ప్రిన్సిపాల్ పి.భాస్కర్ కుమార్ అన్నారు. మండలంలోని గంగారంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి, పరాక్రమ దినోత్సవం పురస్కరించుకొని ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించి మాట్లాడారు. నేతాజీ జయంతి సందర్భంగా జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 144 మంది విద్యార్థులకు "స్వాతంత్ర పోరాట సమర యోధుల చరిత్ర" గురించి నిర్వహించిన క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. గెలుపొందిన విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ రాసిన ఎగ్జామ్ వారియర్స్ పుస్తకాన్ని అందజేశారు. విద్యార్థులను అభినందించిన వారిలో జవహర్ నవోదయ విద్యాలయం వైస్ ప్రిన్సిపాల్ జానకి రాములు, నిర్వాహకులు భాస్కరాచారి, అధ్యాపకులు భారతి, రీమా, రమేష్, ప్రశాంత్, వేణుగోపాల్, బాలాజీ, ఉష, మోహన్, రాజేంద్ర, శ్రీదేవి, శ్రీధర్, పాష, హెచ్ఎం బాలకృష్ణారెడ్డి, రాజారాం ప్రకాశ్, శ్రీధర్, రత్నశేఖర్, రాజప్ప, అశోక్, కొముల య్య శ్రీకాంత్‌రెడ్డి, ఇందు మతి, ఉర్మిళ ఉన్నారు. ● సుభాష్ చంద్రబోస్ జయంతిని జిల్లా కేంద్రంలో పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కొల్లాపూర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సుభాస్ చంద్ర బోస్ చిత్రపటానికి జిల్లా అధ్యక్షుడు నాగపూర్ మధు ఆధ్వర్యంలో మాలలు వేసి నివాళులు అర్పించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జె.రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సుభాస్ చంద్రబోస్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ● ఊర్కొండలో నవభారతి అసోసియేషన్ చైర్మన్, మాజీ సర్పంచ్ మ్యాకల శ్రీని వాసులు, నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు అభిషేక్ ఆధ్వర్యంలో నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ● కొల్లాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్య దర్శి రంగినేని జగదీశ్వరుడు ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళి అర్పించారు.



వట్టెం జవహర్ నవోదయలో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

'లక్ష డప్పులు'ను విజయవంతం చేయాలి

నాగర్‌కర్నూల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు లక్ష డప్పులు వెయ్యి గొంతుకల కార్యక్రమంలో భాగంగా పాపగల్ గ్రామంలో గురువారం మండల మాదిగ దండోరా నాయకుల సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు వెయ్యి గొంతుకల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐతోల్ లక్ష్మయ్య, ఇంద్రకల్ శివ ప్రసాద్, బాల వెంకటయ్య , మాజీ డిప్యూటీ సర్పంచ్ కావలి రమేష్, జోగు రవీందర్, శ్రీశైలం, కావలి బాలయ్య, కావలి చిన్న రాములు, కావలి సురేష్, జోగు జగన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి తోటి ఉద్యోగుల చేయూత

కొల్లాపూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ డిపోలో పదేళ్లుగా డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎల్ఎస్ గౌడ్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులు ఆర్థిక సాయం చేశారు. డిపోలోని తోటి ఉద్యోగులతో పాటు ఇతర డిపోలలో అతని మిత్రులు, ఉద్యోగులు సుమారుగా రూ.82వేల నగదును జమచేశారు. ఆ డబ్బును ఎస్ఎల్ గౌడ్ ఇద్దరి కూతుళ్ల పేర్లపై పోస్టాఫీసులో డిపాజిట్ చేసి పాసు పుస్తకాలను గురువారం డిపో మేనేజర్ ఉమా శంకర్ ద్వారా బాధితుని భార్య అరుణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, డిపో క్లర్కు చక్రపాణి గౌడ్, కార్యాలయ డిప్యూటీ సూపరింటెండెంట్ నజీర్, ఏసీసీలు గౌస్, ఎస్‌డీఐ తిరుపతయ్య, కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.



మృతి చెందిన ఆర్టీసీ ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న తోటి ఉద్యోగులు

నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ బిల్ కలెక్టర్ సస్పెన్షన్

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ బిల్ కలెక్టర్ బి.పావనిని సస్పెన్షన్ చేస్తూ కలెక్టర్ బదావత్ సంతోష్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక బుధవారం పట్టణంలోని 13వ వార్డులో నిర్వహించిన గ్రామసభకు ప్రత్యేక అధికారిగా హాజరు కావాల్సిన బిల్ కలెక్టర్ పావని విధులకు గైర్హాజరై నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు గాను ఆమెను సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సీఎంతోనే మాదిగలకు న్యాయం

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మాదిగల చిరకాల స్వప్నమైన ఎస్సీ వర్గీకరణను అమలు చేసి మాదిగల పక్షాన సీఎం రేవంత్ రెడ్డి ఉంటారని, ఎస్సీ వర్గీకరణకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఫిబ్రవరి 2న హైదరాబాద్‌లో పిడమర్తి రవి ఆధ్వర్యంలో నిర్వహించే మాదిగ విద్యార్థి గర్జన బహిరంగ సభ పోస్టర్లను కల్వకుర్తి మండలం కుర్మిద్ద గ్రామంలో ఎమ్మెల్యే ఆవిష్కరించి, మాట్లాడారు.

ఎర్రవల్లి గ్రామసభలో అధికారుల నిలదీత



అధికారులతో వాగ్వివాదం చేస్తున్న మహిళ

చారకొండ/ కల్వకుర్తి/ చారకొండ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : అన్ని అర్హతలు ఉండి దండం పెట్టి వేడుకున్నా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఎందుకు ఎంపిక చేయలేదని మండలంలోని ఎర్రవల్లి గ్రామంలో గ్రామస్తులు అధికారులను నిలదీశారు. గురువారం ఎర్రవల్లిలో జరిగిన ప్రజాపాలన గ్రామసభలో పలువురు గ్రామస్తులు తమకు అన్ని అర్హతలున్నా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు రాలేదని, ఇదేక్కడి న్యాయమంటూ అధికారులపై మండిపడ్డారు. ఏడాది కాలంగా దరఖాస్తు చేసుకున్న రాని పథకాలు ఇప్పుడు ఇస్తారన్నా నమ్మకం ఏమిటి అంటు ప్రశ్నించారు. కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీవో వెంకటేష్ పేర్కొనగా ఇంకా ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకుంటే ఇస్తారని వాగ్వివాదానికి దిగడంతో పోలీసులు కలుగజేసుకొని వారించినా వినిపించుకోకుండా అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. దీంతో మండల స్థాయి ముఖ్య అధికారులు చెప్పకుండా గ్రామ సభనుంచి వెళ్లిపోయారు. ఉన్న అధికారులు చేసేది లేక గ్రామసభ సమయం వరకు అక్కడే ఉండి వెళ్లిపోయారు. ● కల్వకుర్తి పట్టణంలో సభలు కొనసాగుతున్నాయి. పట్టణంలోని 12, 13 వార్డులో ప్రజాపాలన పట్టణ సభకు మునిసిపల్ చైర్మన్ యడ్మ సత్యం, స్థానిక కౌన్సిలర్లు తలసాని సౌజన్య జనార్దన్‌రెడ్డి, మంజులరాము వేందర్‌గౌడ్, కమిషనర్ మహ్మద్ షేక్ హాజర య్యారు. వివిధ సంక్షేమ పథకాల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ● చారకొండ మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలు గురువారం ముగిశాయి. మండ లంలోని సిర్సనగండ్ల, తుర్కలపల్లి, తిమ్మాయిపల్లి, ఎర్రవల్లి, గైరాన్‌తండాలో అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులు పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తులు ఇవ్వాలని ఎంపీడీవో ఇసాక్‌హుసేన్ అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఏవో తనూజరాజు, డిప్యూటీ విద్యాధర్‌రెడ్డి, తహసీల్దార్ ఎంపీవో వెంకటేష్, ఆర్ఐభరత్, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇస్తాం

- లట్టుపల్లి ప్రజా పాలన గ్రామసభలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్సీ

బిజినేపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని అర్హులైన ప్రతీ ఒక్క లబ్ధిదారుడికి రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా ఇస్తామని నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యుడు మల్లు రవి అన్నారు. మండలంలోని లట్టుపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభలో ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. ప్రజల్లో రోజు రోజుకు సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వంపై ఆదరణ పెరగడాన్ని జీర్ణించుకోలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోవింద నాయక్, చంద్రగౌడ్, శ్రీనివాసులు, తహసీల్దారు శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

అర్హులందరికీ పథకాలు అందుతాయి

- అడిషనల్ కలెక్టర్ అమరేందర్

తెలకపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని అడిషనల్ కలెక్టర్ అమరేందర్ అన్నారు. మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలకు సంబంధించిన గ్రామ సభను గురువారం గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ఈ పథకాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రామ్మోహన్‌రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాసులు, ఎంపీడీవో శ్రీనివాసులు, డీటీ లక్ష్మణ్, ఏఈఈ మల్లేష్, పంచాయతీ కార్యదర్శి టెక్నికల్ అసిస్టెంట్, ప్రజలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రామసభలు

తిమ్మాజీపేట : మండలంలోని గుమ్మకొండ, అప్పాజీపల్లి, ఇప్పలపల్లి, చంద్రాయన్‌పల్లి తండా, తుమ్మలకుంట తండా, పుల్లగిరి గ్రామాల్లో గురువారం నిర్వహించిన గ్రామ సభల్లో మండల ప్రత్యేక అధికారి జిల్లా విద్యా శాఖ అధికారి రమేష్‌కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామకృష్ణయ్య, ఎంపీడీవో లక్ష్మీదేవి, వ్యవసాయ అధికారి కమల్ కుమార్, పశు వైద్యాధికారి శ్రావణి, ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూముల పరిశీలన

లింగాల : మండల పరిధిలోని చెన్నంపల్లి శివారులో వివాదాస్పదంగా మారిన వ్యవసాయ భూములను గురువారం జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అమరేందర్ పరిశీలించారు. సర్వేనంబర్లు 310, 925, 931, 932, 934లలోని భూముల సమస్య హైకోర్టులో విచారణలో ఉంది. కోర్టు సూచనల మేరకు కలెక్టర్ ఆదేశాల తో అదనపు కలెక్టరు విచారణ చేపట్టారు. క్షేత్ర స్థాయిలో భూములను పరిశీలించిన ఆయన పట్టాదారులు ఎవరు, ప్రస్తుతం ఆ భూములను ఎవరు కాస్తు చేస్తున్నారనే విషయాలను తెలుసుకున్నారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ పాండునాయక్, ఎమ్మార్ఐ సీతారాంనాయక్, సర్వేయర్ రాంబాబు ఉన్నారు.

జూనియర్ కళాశాల ఆకస్మిక తనిఖీ

కల్వకుర్తి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం జిల్లా డీఐఈవో వెంకటరమణ ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రిన్సిపాల్ రాంరెడ్డి, లెక్చరర్లతో సమావేశం ఏర్పాటు చేసి కళాశాలకు సంబంధించిన విద్య ప్రణాళికలను, రికార్డులను, విద్యార్థుల హాజరు, యూనియన్ టెస్టు పరీక్షల ఫలితాలు, వార్షిక పరీడలకు ప్రిపరేషన్, విద్యార్థుల లాంగ్ ఆబ్సెంట్ గురించి అడిగి తెలుసుకొన్నారు. ఇంటర్ బోర్డు కమిషనర్ కృష్ణ ఆదిత్య ఆదేశాల మేరకు విద్యార్థుల సంఖ్య పరీక్షల ఫలితాల శాతం పెంచాలని అన్నారు. వార్షిక ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత తేవాలని అన్నారు. కళాశాలకు కావాల్సిన సైన్సు ప్రాక్టికల్స్ మౌలిక సౌకర్యాలు, సీసీ కెమెరాలు ఏర్పాటును పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు ఇష్టంతో భయం లేకుండా చదివి 100శాతం ఉత్తీర్ణ సాధించి పాఠశాలకు మంచి పేరు తేవాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వేణు, సదానందంగౌడ్, మహబూబ్‌అలీ, మల్లేష్, భీమేష్, రాజేష్, బాలరాజ్, శ్రీనివాస్, మల్లికార్జున్, పరుశరాం, జూబేర్, గిరిబాబు, లక్ష్మీకాంత్, సాగర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి వ్యాఖ్యలకు ఖండన

- విలేకరుల సమావేశంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ కార్యకర్తలు నిర్ణయించిన వారికే ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తామని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్, అసెంబ్లీ ఇంచార్జీ కొత్తపల్లి కుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని దేవకి ఫంక్షన్ హాలులో వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెల్కపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో భారత రాజ్యాంగం ద్వారా ప్రజల కోసం ఎన్నికైన ఎమ్మెల్యే ప్రజా వ్యతిరేక వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. నియోజవర్గానికి తాను సేవకుడినని చెప్పుకున్న మాజీ ఎమ్మెల్యే మాదిరే ప్రస్తుత ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి కూడా రాజరిక పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలకు ఎమ్మెల్యేనన్న విషయాన్ని మరువొద్దన్నారు. ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి తక్షణమే ప్రజలకు క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో ఆయన దిష్టిబొమ్మలను దహనం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జీ పృథ్వీరాజ్, నాయకులు కళ్యాణ్, హర్ష ముదిరాజ్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

గెజిటెడ్ హెచ్‌ఎంల డైరీ ఆవిష్కరణ

మన్ననూర్, జనవరి 23 : మన్ననూరు ఐటీడీఏ పరిధిలో పని చేసే గెజిటెడ్ హెచ్‌ఎంల నూతన సంవత్సరం 2025 డైరీలను అటవీ అతిథి గృహం వద్ద ఐటీడీఏ ఇన్‌ఛార్జి పీఓ రోహిత్ గోపిడి గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డీఈవో శంక ర్ నాయక్, ఐటీడీఏ ఏఓ జాఫర్ హుసేన్, ఏసీఆర్‌పీ కల్యాణ్ పాల్గొన్నారు.



డైరీలను ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో రోహిత్ గోపిడి

రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీస్ అథ్లెటిక్స్ పోటీలలో గిరిజన యువకుడి ప్రతిభ

సికింద్రాబాద్ జింఖానా మైదానంలో గురువారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీస్ అథ్లెటిక్స్ పోటీలలో అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామానికి చెందిన విస్లావత్ లక్ష్మణ్ నాయక్ ప్రతిభ చాటి వచ్చే నెలలో చండీఘర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. 100 మీటర్ల పరుగుపందెంలో ప్రథమ, ట్రిబుల్ జంప్‌లో ప్రథమ, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం సాధించి, క్రీడా ఉన్నతాధికారుల చేత బంగారు , రజత పతకాలను అందుకున్నాడు. లక్ష్మణ్ నాయక్ పదర జిల్లా పరిషత్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న విషయ తెలిసిందే.

కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిపై ఎమ్మెల్యే స్పందించాలి

- బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు జానకి

అచ్చంపేటటౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఉన్న ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని, వాటిపై ఎమ్మెల్యే స్పందించాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు జానకి అన్నారు. గురువారం పట్టణంలోని ఏర్పాటు ముఖ్యనాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్యే మైలారం గుట్ట గురించి మాట్లాడుతున్నారు కానీ, అచ్చంపేటలోని ప్రభుత్వ భూమి సర్వేనెం 293 గురించి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. అదేవిధంగా పట్టణంలో మల్లకుంటలో కబ్జాకు గురైన వాటిని వెంటనే కూల్చివేస్తామని గతంలో మాట ఇచ్చారని, ఇప్పుడు వాటి గురించి మాట్లాడడం లేదన్నారు. తక్షణమే ఎమ్మెల్యే స్పదించి ప్రభుత్వ భూములు కాపాడాలని, లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు రాధ, అపర్ణ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

భూమి లేని పేదలందరికీ 'భరోసా' ఇవ్వాలి

- సీపీఎం మండల కార్యదర్శి పి.నరసింహా

కోడేరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : భూమి లేని పేదలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ. 12వేలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి నరసింహ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారులు లబ్ధిదారుల ఎంపికలో విఫలమైనట్టు వారు రూపొందించిన జాబితాను పరిశీలిస్తే అర్థమవు తోందని అన్నారు. పలు డిమాండ్లతో కూడిన తీర్మానాన్ని అధికారులకు అందజేమని ఆయన తెలిపారు. అనంతరం ఆయన సంగారెడ్డి జిల్లాలో జరగనున్న సీపీఎం రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 25వ తేదీ నుంచి 28 వరకు సంగారెడ్డి జిల్లాలో జరగుతాయని తెలిపారు. పార్టీ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాకం లక్ష్మయ్య, బి.లక్ష్మయ్య, డి.శివయ్య, ఆనంద్ పాల్గొన్నారు.



కోడేరు అంబేద్కర్ విగ్రహం వద్ద పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు